క్లుప్తంగా

ఐలవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఐలవరం(భట్టిప్రోలు): పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలలో భాగంగా మంగళవారం భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామ పంచాయతీ పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్వీ రమణ, ఈవోపీఆర్డీ టి. ఉషారాణి, ఏపీవో శివపార్వతి, టెక్నికల్ అసిస్టెంట్స్ సుధీర్, రామ కోటి, పంచాయతీ రాజ్ ఎఈ శేతు రామచంద్రరరావు, ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి



చెరుకుపల్లి: కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను రెగ్యులైజ్ చేయాలని మండలంలోని కారూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఏడుగురు మంగళవారం వినూత్నంగా పసుపు రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలయ్య, జయశ్రీ, నాగలక్ష్మీ, సుందరికుమారి, శారద పాల్గొన్నారు.

రేపు పట్టభద్రుల సమావేశం



వేమూరు: శ్రీ లక్ష్మీ గణపతి కల్యాణ మండపంలో ఈనెల 17న ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల పట్టు భద్రుల సమావేశం నిర్వహిస్తా మని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పూనూరు గౌతమ్ రెడ్డి, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విస్తారంగా వర్షాలు



రేపల్లె రూరల్: అల్పపీడనం ప్రభావంతో రేపల్లె నియోజకవర్గంలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 9 గంటల వరకు విడతల వారీగా జల్లులు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి వర్షం తెరిపిచ్చినా ఆకాశం మేఘావృతమై కనిపించింది. రేపల్లెలో 67.4 మిల్లీమీటర్లు, నిజాంపట్నంలో 60.6 మిల్లీమీటర్లు, నగరంలో 41.8 మిల్లీమీటర్లు, చెరుకుపల్లిలో 34.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నిత్యం చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కొల్లిపర: ప్రతి ఒక్కరూ వివిధ పనులు చేసే సమయంలో పని చేయక ముందు, పని చేసిన తరువాత నిత్యం సబ్బుతో చేతులు కడుకుంటూ పరిశుభ్రంగా ఉండాలని, అలా చేయటం వలన ప్రజలల్లో వచ్చే అతిసార వ్యాధిని 50శాతం పైగా నివారించవచ్చు అని ఎంపీడీవో వి.విజయలక్ష్మి సూచించారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లాపరిషత్‌ఉన్నత పాఠశాలోని విద్యార్థులకు చేతుల పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన 30% శ్వాస సంబందిత వ్యాధులు నివారించవచ్చు అని అన్నారు, అనంతరం ఏఎన్‌ఎంలు విద్యార్థులకు సబ్బుతో ఏవిధంగా శుభ్రంగా చేసుకోవాలన్న అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఝాన్సీలత, హెచ్‌ఎం డి.వెంకట్రావు, ఈవోపీఆర్డీ బార్గవ, పంచాయతీ కార్యదర్శి అలకనంద, ఎం.ఆర్‌సి వెంకటరెడ్డి, ఎన్‌ఎమ్‌లు, సచివాలయం సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

మినుము పంటకు వాన దెబ్బ

- పొంచి ఉన్న ముంపుముప్పు
- ఇప్పటికే వరదలకు నిండా మునిగిన రైతులు
- కృష్ణాతీర కర్షకుల ఆర్తనాదాలు



కొల్లూరు కరకట్ట దిగువన వర్షపు నీటిలో నానుతూ రంగు మారుతున్న మినుము పైరు

కొల్లూరు: కృష్ణా తీర రైతాంగం ప్రకృతి విపత్తుల రూపంలో ముప్పేట దాడికి గురై తీరని పంట నష్టాలను మూటగట్టుకొని తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. నెలన్నర క్రితం కృష్ణా నది వరదలు సృష్టించిన విలయతాండవం కారణంగా రూ. వేల కోట్ల విలువైన వాణిజ్య పంటలను కోల్పోయిన వారు ముంపుముప్పు వీడిన పొలాల్లో మినుమం గ్యారెంటీ పంటైన మినుము వేశారు. గత ఏడాది వేసిన మినుము కష్టాల నుంచి గట్టెక్కించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇప్పుడు మినుము పంట భారీవర్షాలకు ముంపునకు గురవుతోంది. ఫలితంగా రైతులు ఆవేదన చెందుతున్నారు.

వరదలకు 11వేల ఎకరాల్లో పంట మటాష్

ఈ ఏడాది ఖరీఫ్‌లో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో 11 వేల ఎకరాలకు పైబడి సాగులో ఉన్న అరటి, పసుపు, కంద, తమలపాకు, జామ వంటి వాణిజ్య పంటలకు తోడు కూరగాయలు, ఇతర పంటలు ముంపు బారిన పడి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఈ తరుణంలో వరద ముంపు వీడిన పొలాలలో రైతులు ప్రత్యామ్నాయ పంటగా మినప పంట సాగుకు మొగ్గు చూపారు. గతేడాది సుమారు 600 ఎకరాలలో లంక గ్రామాలలోని మెట్టప్రాంత రైతాంగం మినుము సాగు చేయడంతో ఆశించిన దిగుబడులు వచ్చాయి. ధర కూడా క్వింటా రూ. 7 వేల నుంచి రూ. 8 వేల వరకు లభించింది. దీంతో ఆ ధీమాతో ఈ ఏడాది వరదలకు దెబ్బతిన్న పంటల స్థానంలో సుమారు 1,500 ఎకరాల విస్తీర్ణంలో రైతులు మినుము సాగు చేపట్టారు.



లంక గ్రామాలలో వర్షం కారణంగా తెలుపు రంగులోకి మారుతున్న మినప పంట

తీరని నష్టం తప్పదా..!



దోనేపూడి కరకట్ట సమీపంలో వర్షపు నీటిలో నానుతున్న మినప పంట

వరదల అనంతరం సాగు చేసిన మినప పంట ప్రస్తుతం మొక్క దశలోనే ఉండటంతో అల్పపీడన ప్రభావంతో మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లనుందన్న ఆవేదన రైతాంగంలో వ్యక్తమవుతోంది. సాధారణంగా అదనుకు అవసరమైన నీరు అందించి పొడిబారిన పొలాల్లో సాగు చేసే మినప పంటకు నీరు అధికంగా ఉంటే పంట ఎదుగుదల లోపిస్తుందన్న ఆవేదన రైతుల్లో వెల్లడవుతోంది. మినుము సాగులో ఉన్న భూముల్లో వర్షపు నీరు నిలిచి ఉండటానికి తోడు, మరో రెండు, మూడురోజులు వర్షాల తీవ్రత అధికంగా ఉంటుందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మినప పంట బతికి బట్టకట్టడం కష్టతరమేనని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. మినప విత్తనాలు విత్తిన దగ్గర నుంచి ఎకరాకు రూ.5 వేలకుపైగా పెట్టుబడుల రూపంలో వెచ్చించి సాగు చేస్తున్న పంట వర్షాల వల్ల పొలాల్లో నీరు నిలిచి తెల్లబారిపోతుండటంతో దిగుబడులు సగానికి సగం తగ్గి తీరని నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు వాపోతున్నారు.

మొక్క ఎదుగుదలకు ముప్పు



వర్షాలు విపరీతంగా కురుస్తున్న నేపథ్యంలో మినప మొక్క ఎదుగుదలకు తీవ్ర ముప్పు వాటిల్లనుంది. మినప మొక్కలు ఉరకకు ఎందుకూ పనికిరాకుండా పోవడంతోపాటు, రంగు మారిపోయి మొక్క పెరుగుదల నిలిచిపోవడానికి ఆస్కారం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల మినుము పంటను కాపాడడం కష్టతరంగా కనిపిస్తోంది.

– కర్ర విజయ్, దోనేపూడి, కొల్లూరు మండలం

వానలతో మినుముకు తీవ్ర నష్టం



పొడి వాతావరణంలో అనువుగా పెరిగే మినప పంటకు అధికంగా వర్షాలు కురవడం తీవ్ర నష్టానికి కారణం అవుతుంది. కొద్దిపాటి నీటి సాయంతో సాగయ్యే మినుముకు అధిక నీరు నిలవడం కారణంగా పంట మొత్తం దెబ్బతిని ఆకుమచ్చ తెగులు, పురుగుల బెడద అధికమయ్యే ముప్పు పొంచి ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టని పక్షంలో మినుము పంట ఎందుకు పనికిరాకుండా పోతుంది.

– ఆరుమళ్ల విజయ్‌కుమార్, దోనేపూడి, కొల్లూరు మండలం

నీరు నిలవకుండా జాగ్రత్తలు పాటించాలి

వర్షపు నీరు మినప పైరులో నిలవ ఉండకుండా రైతాంగం తగిన జాగ్రత్తలు తీసుకొని సాగులో ఉన్న పంటను కాపాడుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షాల ప్రభావంతో మినప పైరుకు ఆకుమచ్చ తెగుళ్లు సోకకుండా వానలు తగ్గుముఖం పట్టిన వెంటను కార్బండిజమ్ 1 గ్రాము 1 లీటరు నీటికి, లేదా, సాఫ్ 2 గ్రాములు 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి వారి సూచనలను పాటించిన పక్షంలో పంట నష్టం వాటిల్లకుండా కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది.

– ఆర్. వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖాధికారి, కొల్లూరు

18న ఎస్వీఆర్‌ఎం కళాశాలలో జాబ్‌మేళా

నగరం: స్థానిక ఎస్వీఆర్‌ఎం కళాశాలలో ఈనెల 18న జాబ్‌మేళా జరుగుతుందని కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి చెప్పారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్వీఆర్‌ఎం కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో టాటా క్యాపిటల్, అంబిందో ఫార్మసీ, మాస్టర్‌మైండ్స్, ఏయూ ఫైనాన్స్ బ్యాంక్ ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.150కు పైగా ఖాళీలు ఉన్నాయని, విద్యార్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ చేసిన 18నుంచి 32 సంవత్సరాలలోపు వయస్సు కల్గినవారు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చునని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9347468946 సంప్రదించాలని కోరారు. సమావేశంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ పాల్గొన్నారు.

రేపు ఆలయాల్లో సామూహిక హారతులు

భట్టిప్రోలు: ఈనెల 17వ తేదీన వాల్మీకీ జయంత్యుత్సవం సందర్భంగా ఆలయాల్లో సామూహిక హారతులు నిర్వహించాలని ఎస్‌ఎస్‌ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మంగళవారం పిలుపునిచ్చారు. ఆ రోజు దేవాలయాల్లో శ్రీరామ జయ రామ–జయ జయ రామ జప మంత్రాన్ని పఠించి వాల్మీకీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 16న బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని జేఎల్‌బీ కళాశాల, నిజాంపట్నం రోడ్డు ఉత్తరవైపు ఏరియా, గరువురోడ్డుతో పాటు బేతపూడి, ఉయ్యూరువారిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా మండలి భవనం అప్పగింత



తెనాలిఅర్బన్: కొత్తపేటలోని మహిళా మండలి భవనాన్ని మంగళవారం మున్సిపల్ అధికారులకు రెవెన్యూ అధికారులు అప్పగించారు. మహిళా మండలి నిర్వాహకులు డాక్టర్ కస్తూరి భాయ్ భవనాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రక్రియ పూర్తికావడంతో తెనాలి తహశీల్దార్ గోపాకృష్ణ దానికి సంబంధించిన పత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ బండి శేషన్నకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా మండలి భవనం పురపాలక సంఘ అధీనంలోకి వచ్చిందన్నారు. దీని నిర్వాహణ, ఇతర కార్యక్రమాలు మున్సిపాలిటీ ద్వారాచేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ టీపీవో సాంబశివరావు, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మహనీయుడు అబ్దుల్ కలాం

వేమవరం(భట్టిప్రోలు): ఏపీజే అబ్దుల్ కలాం మహనీయులని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం భట్టిప్రోలు మండలం వేమవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎల్‌ఈ)లో సామాజిక కార్యకర్త పొన్నపల్లి సత్యనారాయణ కలాం జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పడవల కిషోర్, ఎస్‌ఎంసీ చైర్మన్ కె. అనిత, తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అబ్దుల్ కలాం జయంత్యుత్సవం నిర్వహించారు. నాన్నగారు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పొన్నపల్లి సత్యనారాయణ కలాం జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.అరుణకుమారి, ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్లోనూ కలాం జయంత్యుత్సవం జరిగింది. కార్యక్రమంలో హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎ. సుగుణకుమారి పాల్గొన్నారు.

నిజాంపట్నం రోడ్డులో..

రేపల్లె రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో అబ్దుల్ కలాం జయంత్యుత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపట్నం రోడ్డులోని కలాం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిన్ని సాంబశివరావు, హనోక్‌బాబు, నరసింహ, రవితేజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు కలాం ఆదర్శం

అమర్తలూరు(వేమూరు) : అబ్దుల్ కలాం నేటి యువతకు అదర్శమని షేక్ మౌలాలి అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ యూత్ అధ్వర్యంలో మంగళవారం కలాం జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కంభంగిరి, మారం సత్యవతి, మస్తాన్ బీ, షేక్ సిలార్, షేక్ బురానీ, సతీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో..

బాపట్లటౌన్: ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మంగళవారం కలాం జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జమృద్దీన్‌బాషా, ఉపాధ్యాయులు మాణిక్య రావు, జాన్ వెస్లీ, లలిత,పద్మజ, శేషాద్రి నాయుడు, సురేష్ పాల్గొన్నారు.



వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



అమర్తలూరులో..



బాపట్లలో కలాం విగ్రహం వద్ద నివాళి

పల్లె పండగను జయప్రదం చేద్దాం

బాపట్ల/వేమూరు: పల్లె పండుగ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కర్లపాలెంలో పల్లె పండుగ కార్యక్రమం మంగళవారం జరిగింది. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్‌ఈ హరే రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- వేమూరు నియోజక వర్గంలోని పెరవలి పాలెం, పెరవలి, చావలి, భట్టిప్రోలు మండలంలోని ఐలవరం గ్రామంలో సిమెంట్ రోడ్లకు మంగళవారం ఎమ్మెల్యే ఆనందబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దండే సుబ్బారావు, జొన్నలగడ్డ విజయబాబు, ఉస్సా రాజేష్, అయా గ్రామాలకు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.
- చెరుకుపల్లి: పల్లె పండుగ కార్యక్రంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఈవోపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్ తెలిపారు. మండలంలోని ఆరుంబాక, కావూరు గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు, అనంతరం రెండు గ్రామాలో మహాత్మాగాంధి జాతీయ ఉపాధిహామీ నిధులతో ఒక్కో గ్రామంలో రూ. 15లక్షల చొప్పున సీసీ రోడ్లకు శకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నాగలక్ష్మీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మాలతి, టిఏ శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల: బాపట్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. వర్షాలతో డ్రెయినేజీలు నిండిపోయి రోడ్లపైకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణా, డి.శ్రీనివాసరావు, ఏఈ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

మున్సిపల్ షాపింగ్‌కాంప్లెక్స్ అద్దెలు వసూళ్ళు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి రెవెన్యూఅధికారులకు సూచించారు.పట్టణంలోని షాపింగ్‌కాంప్లెక్స్‌లు,మార్కెట్ ఆశీలు వసూళ్ళుపై సమీక్షించారు.మొండిబకాయిలు ఉంటే వెంటనే వసూళ్ళు చేయాలని సూచించారు.




మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన ఉత్పత్తులు



బాపట్లలో రైతులకు జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న వాణిశ్రీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో విజయ్‌బాబు

రేపల్లె రూరల్/బాపట్ల టౌన్/వేమూరు: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ నాణ్యతతో కూడిన ఉత్పత్తులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని చాట్రగడ్డ గ్రామంలో రైతులకు, వ్యవసాయ అధికారులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో సాగులో వ్యయం తగ్గుతుందన్నారు. అంతేకాకుండా పర్యావరణాన్ని పరిరక్షించటంతో పాటు భూసారాన్ని పెంచుకోవచ్చని సూచించారు. సాగులో సమస్యలు ఎదురైతే వ్యవసాయ సహాకులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

- వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నరసాయపాలెం, కంకటపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వి. వాణిశ్రీ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.
- చుండూరు మండలంలోని అంబేడ్కర్ నగర్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళ వారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆదంబాబు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.
- అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి పాల్గొని రైతులకు సాగులో జాగ్రత్తలు వివరించారు.

కొల్లిపరలో కొండ చిలువ హతం

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర గ్రామ శివారులో కొండచిలవను గ్రామస్తులు హతమార్చారు. కృష్ణా నది కరట్ట దిగువున భీమవరపు బ్రహ్మారెడ్డి చెందిన కోళ్ల ఫారం వద్ద కొండ చిలువ రాత్రి సమయంలో సంచరిస్తున్న విషయాన్ని అక్కడి పనిచేసేవారు గమనించారు. వారం రోజులుగా కోళ్ల ఫారంలో రాత్రి సమయంలో కోళ్లు మాయమవడం, రాత్రి సమయంలో కోళ్లు ఒక్కసారిగా అన్ని అరవటంతో కాపుకాశారు. పంట పొలంలో నుంచి భారీ కొండ చిలువ దగ్గరలో ఉన్న కరెంట్ స్తంభంపై నుంచి కోళ్ల ఫారం మొదటి అంతస్తులో ఉన్న వాటి వద్దకు వెళ్లడాన్ని వారంతా గమనించారు. వెంటనే దాన్ని ఒడిసిపట్టి చంపేశారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలు ఖాళీ

దగ్గరుండి ఖాళీ చేయించిన అధికారులు

తెనాలిరూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాలను అధికారులు ఖాళీ చేయించి, సరుకును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న కొద్దిపాటి సరుకును ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి వరకు ఈ తతంగం కొనసాగింది. ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న ప్రైవేటు భవనాల యజమానులతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్న ప్రైవేటు మద్యం దుకాణాల లబ్ధిదారులు, మంగళవారం మధ్యాహ్నానికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సరుకును బయట పెట్టించి, దుకాణాలను సిద్ధం చేసుకున్నారు. మరోవైపు వారం రోజులుగా ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరుకు వేయడం ఆపేశారు. అన్న సరుకునే విక్రయించాలని మద్యం దుకాణాల సిబ్బందికి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. బార్లలో అధిక ధరలు చెల్లించలేక మందు బాబు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులో ఉన్న బ్రాండ్‌లనే తప్పక కొనుగోలు చేయాల్సి వచ్చింది. పట్టణంలో ఏడు ప్రభుత్వ మద్యం దుకాణాలు, మూడు లిక్కర్‌మాల్స్, మండలంలో ఐదు దుకాణాలు ఉండగా, ఖచ్చిత సమయపాలన పాటిస్తూ ఇన్నాళ్లు మద్యం విక్రయాలు జరిగాయి. ప్రస్తుతం పట్టణంలో 11, మండలంలో ఐదు షాపులు ఏర్పాటు కానున్నాయి. ఈ దుకాణాలు సమయపాలన పాటించే విధంగా ఎక్సైజ్, పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారేమో వేచి చూడాల్సిందే.



మూతబడిన బోస్‌రోడ్డులోని ప్రభుత్వ మద్యం^ుకాణం

డిస్లెక్సియా వ్యాధిని అధిగమించడం సులువే

ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతిబాబు



తెనాలిఅర్బన్: డిస్లెక్సియా అనేది మానసిక సమస్య అని, దానిని అధిగమించడం పెద్ద కష్టమేమి కాదని తెనాలి మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబులు పేర్కొన్నారు. ప్రపంచ డిస్లెక్సియా వారోత్సవాల సందర్భంగా కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ నుంచి మంగళవారం ఏర్పాటు చేసిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి లేకపోవడం, అక్షరాలు వరుస క్రమంలో రాయకపోవడం వంటివి డిస్లెక్సియా లక్షణాలని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అలాంటి విద్యార్థులపై కొంత శ్రద్ధ చూపిస్తే దానిని పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి ఏటా అక్టోబర్ నెలలో దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు సునీల్, సునీత, పలువురు సీఆర్‌ఎంటీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.